క్లుప్తంగా

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

వంగర: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్ వంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు సంబంధించి, అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



కవాతు ప్రదర్శనలో పోలీసులు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు, సుందరాడ, నెమలాం గ్రామాల్లో తెర్లాం ఎస్‌ఐ ఆర్.రమేష్ ఆధ్వర్యంలో కేంద్రబలగాలతో కలిసి పోలీసులు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిరుమలరావు మాట్లాడుతూ మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని కోరారు.ఎస్పీ ఎం.దీపికా పాటిల్ ఆదేశాల మేరకు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, మండలంలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ఈ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తూ ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేలా ధైర్యం కల్పిస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



ఆలయ ప్రారంభోత్సవంలో చేసిన మండపారాధన దృశ్యం

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చింపేట గ్రామంలో కోదండరామాలయ ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు రంపా హనుమంతురావు ఆధ్వర్యంలో ఉదయం మహాగణాధిపతిపూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచగవ్యప్రాశన, రక్షాబంధనధారణ, రుత్విక్‌వరుణ్, యోగిని, నవగ్రహ, క్షేత్రపాలన, సర్వతభద్రమండలం, ఆవాహన, హోమగుండ సంస్కార పూజలు చేపట్టారు. బుచ్చింపేట గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలోని జాకేరు ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. ముందుగా విద్యార్థుల వర్క్ బుక్స్, ఉపాధ్యాయుల లెసెన్ ప్లాన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించడంతో పాటు తెలుగు, ఇంగ్లిష్ పదాలు రాయించారు. మధ్యాహ్న భోజన వంటకాలను రుచిచూశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం చామలాపల్లి, కరకవలస ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కరకవలసలో నాడు-నేడు పనులను పరిశీలించారు.

ఎల్లారమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేటలో జరుగుతున్న ఎల్లారమ్మ జాతకు గురువారం భక్తులు పోటెత్తారు. మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు. గజపతినగరం, డోలపాలెం, సీతారామపురం, పిడిశీల, తదితర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓటు వజ్రాయుధం

గజపతినగరం రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిందని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని గజపతినగరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, విజయనగరం ఆర్డీఓ సూర్యకళ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై మండల కేంద్రంలో బీఎల్‌ఓలు, ఎన్నికల సిబ్బందితో కలిసి గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వ హించారు. ముందుగా ద్విచక్రవాహనాలతో ర్యాలీ చేశారు. నాలుగురోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. బస్సులో వెళ్తున్న ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఆర్డీఓ మాట్లాడుతూ మనం వేసే ఓటు దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతులు తప్పనిసరి



రాజాం సిటీ: రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన ఎన్నికల ఆర్‌వో జోసెఫ్



బొబ్బిలి: ఆల్ పార్టీ నేతల సమావేశంలో సూచనలిస్తున్న ఆర్‌డీవో సాయిశ్రీ

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్

రాజాం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీల నేతలు ప్రచార ర్యాలీలు చేయాలన్నా, బహిరంగ సమావేశాలు నిర్వహించాలన్నా ముందస్తుగా ఎలక్షన్ కమిషన్ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని పలు పార్టీ ల నేతలతో గురువారం సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ తమకు సహకరించాలని కోరారు. ఎన్నికల బరిలో నిలిచే పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రచారాలు చేసుకోవాలని సూచించారు. గతంలో మాదిరి కాకుండా ఈ దఫా ఎన్నికల నిబంధనలు కఠినంగా ఉన్నాయని, వీటిని అందరూ అనుసరించాలన్నారు. ఎన్నికల ప్రచారంతో పాటు పార్టీ బహిరంగ సమావేశాలు, బైక్ ర్యాలీలు, ఇళ్లపై జెండాలు కట్టడం వంటి 19 కార్యక్రమాలకు అనుమతులు తీసుకోవాలని, వీటి నిమిత్తం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి 24 గంటల ముందు అనుమతులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ బి.ప్రకాష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

48 గంటల ముందుగానే..

బొబ్బిలి: ఎన్నికల ప్రచారానికి రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులు అనుమతులు తీసుకోవాలని డివిజనల్ ఎన్నికల అధికారి, ఆర్‌డీవో ఎ.సాయిశ్రీ సూచించారు. ఇదే విషయమై ఆమె తన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సభలకు సంబంధించి, 48 గంటలకు ముందుగానే దరఖాస్తు చేసుకుని, అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రచార సరళి పర్యవేక్షణకు తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నియమించినట్లు పేర్కొన్నారు. ఈ స్క్వాడ్‌లో మెజిస్ట్రేట్ అధికారి, పోలీసులు, వీడియో గ్రాఫర్లు ఉంటారన్నారు. వీరు మూడు షిఫ్ట్‌లలో(24 గంటల విధులు) పనిచేస్తారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత రెవెన్యూ డివిజన్ పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో పార్టీ కార్యాలయాలు ఉండాలన్నారు. పిల్లలను ఎన్నికల ప్రచారంలో వినియోగించొద్దన్నారు. రూ.50 వేలు దాటి నగదు తీసుకువెళ్లేటప్పుడు దానికి సంబంధించి, లెక్కలు సరిగా చెప్పాలన్నారు. ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇదే కార్యాలయంలో ఆల్‌పార్టీ నేతలతో సమావేశమైన ఆమె ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: గూడెపువలసలో ఎన్నికల కోడ్ అమలును పరిశీలిస్తున్న ఎంసీసీ పర్యవేక్షణాధికారి ఆంజనేయులు

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు

బాడంగి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేయాలని ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) పర్యవేక్షణాధికారి ఆంజనేయులు సూచించారు. మండలంలోని రేజేరు, వాడాడ, కోటిపల్లి, గూడెపువలస గ్రామ సచివాలయాలను గురువారం సందర్శించిన ఆయన ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పరిశీలించారు. ఎక్కడైనా రాజకీయ ప్రచార చిత్రాలు, బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగ్‌లు ఉంటే వాటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి విశేష ఆదరణ



రేగిడి: సరసనాపల్లిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రేగిడి: వైఎస్సార్ సీపీకి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని, ఏ గ్రామం వెళ్లినా ప్రజల నుంచి తమకు లభిస్తున్న ఆదరాభిమానాలే దానికి నిదర్శమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని సరసనాపల్లి, జోడిబందల, కందిశ, వెంకంపేట, తునివాడ, మీసాలపేట గ్రామాల్లో ఇంటింట ప్రచారం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ప్రతీ ప్రాంతం అభివృద్ధి చెందేలా పనులు, ప్రతీ వ్యక్తి సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. విజయనగరం ఎంపీగా మరోసారి పోటీ చేస్తున్న తనను, రాజాం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న రాజేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, సర్పంచ్‌లు కర్రి అప్పలనాయుడు, కెల్ల మన్మథరావు, కరణం శ్రీనివాసరావు, సంకిలి సొసైటీ అధ్యక్షుడు లావేటి వేణుగోపాలనాయుడు, ఎంపీటీసీలు వంజరాపు శ్రీనివాసరావు, మజ్జి శ్రీనివాసరావు, రెడ్డి నర్సింగరావు, పిల్లా గౌరునాయుడు, రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రేగిడి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలా అయితేనే అందరం ఆరోగ్యంగా ఉంటామని రాజాం జీసీఎస్‌ఆర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్(జాతీయ సేవా పథకం)-2 పీవో తురంగి విశ్వనాథం అన్నారు. మండలంలోని మునకలవలస గ్రామంలో విద్యార్థులు గురువారం శ్రమదానం చేపట్టారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెత్తాచెదారం ఏరివేసి, వాటికి నిప్పంటించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం సాంకేతిక విద్య, ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

బొండపల్లి: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ - 2 పీఓ బొత్స ధర్మారావు అన్నారు. మండలంలోని గొట్లాంలో ఎన్ఎస్ఎస్-2 ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయలో పడొద్దు



పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: పొత్తుల పేరిట బీజేపీ, జనసేనల ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకున్న మాయలోడు చంద్రబాబు అని, అతడి మాయలో పడొద్దని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలంతా తమ మధ్య ఏవైనా పొరపచ్చాలుంటే వాటిని పక్కనబెట్టి అందరూ ఐక్యంగా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ పాలనలో లబ్ధి పొందిన వారంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తారని, 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేశానని, 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు ఎన్నికల్లో ఏనాడూ ఒంటరిగా పోటీచేసే దమ్మూ, ధైర్యం లేవని విమర్శించారు. ఎంతమంది కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలకే మేలు అని, పేదలను పట్టించుకోరన్నారు. అందరి అభివృద్ధి, సంక్షేమం కావాలంటే మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతీ కార్యకర్త పార్టీకి నష్టపరిచే ఆలోచనలు చేయకుండా అందరం ఏకతాటిపైకి వచ్చి, చర్చించుకుని ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలరు. ప్రభుత్వం చేసిన మేలును ప్రతీ ఇంటికి వెళ్లి, వివరించాలని, అలాగే టీడీపీని ఎందుకు నమ్మకూడదో వైఎస్సార్ సీపీని ఎందుకు నమ్మాలో కూడా వివరించగలగాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, పార్టీ మండల ఉపాధ్యక్షులు డర్రు పైడిరాజు, కటికి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



రేగిడి: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో కనకదుర్గ



సంతకవిటి: పౌష్టికాహార ప్రయోజనాలను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణశ్రీ

రేగిడి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులంతా ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని రాజాం ఐసీడీఎస్ పీవో టి.కనకదుర్గ అన్నారు. మండలంలోని ఉంగరాడమెట్ట దగ్గరున్న మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించి, పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శనను ఆమె తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం లబ్ధిదారులకు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేసి, కేంద్రాల పనితీరు మరింత మెరుగుపరచాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీపీసీ లెంక నారాయణరావు, సూపర్‌వైజర్ సీహెచ్ నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని శేషాద్రిపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరుణశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా వారికి అందివ్వాలన్నారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉంటామన్న విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, భూలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని మెంతిపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ఆవశ్యకతపై గురువారం అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్యాసమ్మ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజువారీ తినే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య



పక్కి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల ఆటపాటలు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి

బొబ్బిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి సూచించారు. మండలంలోని పక్కి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం -1, 2లను ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా చేపట్టిన చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన, చిన్నారుల ఆటపాటలను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యంతో పాటు విద్యపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం క్రమ తప్పకుండా లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. పట్టణంలోని గంగుల వీధి, వీవర్స్ కాలనీ, పాకి వీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఆమె సందర్శించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు వై.రాజు, అరుణ, ఏఎన్ఎం రామలక్ష్మి, మహిళా పోలీసులు కల్యాణి, నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాడు అధ్వానం.. నేడు అద్భుతం!





ఈ చిత్రంలో కనిపిస్తోంది.. బొబ్బిలి సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం). ఇది ఒకప్పుడు చాలా అధ్వానంగా ఉండేది. గతంలోని టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అరకొరగా సదుపాయాలు. ఏ చిన్నపాటి అనారోగ్య సమస్యతో వెళ్లినా జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేసే పరిస్థితులు ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు పథకం కింద రూ.3 కోట్ల వ్యయంతో ఆస్పత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేశారు. రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందిస్తుండడంతో పాటు గర్భిణుల సాధారణ ప్రసవాలు కూడా చేయడం జరుగుతోంది. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చొరవతో ఇప్పటి భవనంపైన మరిన్ని కొత్త గదుల నిర్మాణం, వంద పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు పంపడం విశేషం.

–బొబ్బిలి

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



సమావేశానికి హాజరైన గజపతినగరం,దత్తిరాజేరు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. స్థానిక బెల్లాన కన్వెన్షన్‌లో గజపతినగరం,దత్తిరాజేరు మండలాల పార్టీ కార్యకర్తలు,నాయకులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భం గా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా పార్టీ లతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సీఎం సమప్రా ధాన్యం ఇచ్చారని చెప్పారు. చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వివరించాలని పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులను ఎమ్మెల్యే కోరారు.పార్టి కోసం కష్టపడి పని చేసిన ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.వి.సూర్యనారాయణరాజు (సురేష్‌బాబు)మాట్లాడుతూ గజపతినగరం ఎమ్మెల్యేగా అప్పలనరసయ్య, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను మరోమారు బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు నారాయణ మూర్తిరాజు, ప్రభూజీరాజు, ఎమ్మెల్యే అప్పలనరసయ్య తనయుడు, యువనాయకు డు బొత్స సాయి గురునాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, గజపతినగరం,దత్తిరాజేరు మండలాల జెడ్పీటీసీలు గార తవుడు, రౌతు రాజేశ్వరి, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, రాపాక కృష్ణమూర్తి, దత్తిరాజేరు ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్లు కె.సుబ్రహ్మణ్యం, మహదేవ్ ఫణీంద్రుడు, దత్తిరాజేరు వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, స్థానిక ఏపీసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, నాయకులు రెడ్డి పద్మావతి, మండల సురేష్,బెల్లాన త్రినాథ రావు, లెంక శ్రీనివాసరావు, సామంతుల పైడిరాజు, బమ్మిడి అప్పలనాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.